సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం, 12, సెప్టెంబర్, 2023





**తండ్రీకూతురు మృతి**

భువనగిరిలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందారు. - 8లో



**అలంకారప్రాయంగా..**

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ, పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. - 9లో



**తెలంగాణ నంబర్ వన్**

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. - 9లో

## న్యూస్‌రీల్

### బదిలీల జాబితాపై 80 అభ్యంతరాలు

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీల కోసం 2,260 దరఖాస్తులు రాగా ఇందులో 18 దరఖాస్తులను తిరస్కరణకు గురయ్యాయి. తదనంతరం 2,242 మంది జాబితాను అధికారులు ప్రకటించారు. ఈ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ సోమవారం ముగిసింది. మొత్తం 80 అభ్యంతరాలు రాగా వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి అర్హుల జాబితా ప్రకటించనున్నారు.

### యాదాద్రి శివాలయంలో విశేష పూజలు



స్వామివారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారికి నిత్యకైంకర్యాలు చేపట్టిన అనంతరం మండపంలో నిత్య రుద్ర హవనం గావించారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు జరిపించారు.ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులుతీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.46,87,423 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### 'విజయభేరి'కి తరలిరావాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విజయభేరి సభకు జిల్లా నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా నుంచి 50వేల మందిని తరలించాలని నిర్ణయించామన్నారు. గ్రామాలు, పట్టణాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, నాయకులు సంజీవరెడ్డి, మల్లేష్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని మల్లాపురంలో గతంలో సర్వేయర్‌గా పని చేసి, ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కొండాపురం మండలంలో విధులు నిర్వహిస్తున్న కె.సిద్దులుకు జిల్లా సర్వేయర్ సోమవారం నోటీసులు జారీ చేశారు. 2016లో మల్లాపురంలోని సర్వే నంబర్ 64లో ఐదెకరాల స్థలానికి సంబంధించి, నిబంధనలకు విరుద్ధంగా ఓ వ్యక్తి స్వాధీనం, ధృవీకరణ పత్రాలు ఇచ్చారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కలెక్టరేట్ ఆదేశాల మేరకు నోటీసు జారీ చేసినట్లు జిల్లా సర్వేయర్ తెలిపారు. ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

### అటవీ అమరుల త్యాగం మరువలేనిది



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ దేవిలాల్

చౌటుప్పల్ : అమరుల త్యాగాలు మరువలేనివని చౌటుప్పల్ ఫారెస్ట్ రేంజర్ దేవిలాల్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం చౌటుప్పల్ పట్టణ శివారు లింగారెడ్డిగూడెం సమీపంలోని స్మృతివనంలోని అటవీశాఖ అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవుల సంరక్షణలో ఎంతో మంది బాధ్యతతో విధులు నిర్వహించి పలు ఘటనల్లో అమరులయ్యారని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు వృథా కావన్నారు. అమరుల స్ఫూర్తితో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు.

# రావమ్మా.. గృహలక్ష్మి!

**34,451 దరఖాస్తులు**

- 24,291 మంది అర్హులుగా గుర్తింపు
- తొలి విడతలో 8,400 మందికి ఆర్థిక సాయం అందజేయాలని లక్ష్యం
- పూర్తయిన లబ్ధిదారుల ఎంపిక
- సాయం కోసం ఎదురుచూపులు



సాక్షి, యాదాద్రి : గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సొంత స్థలం కలిగి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారి నుంచి ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షల కోసం గత నెల 8,9,10 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను సేకరించిన అధికారులు.. అర్హుల జాబితాను ఆన్‌లైన్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 34,451 దరఖాస్తులు రాగా వీటిలో 24,291 మందిని అర్హులుగా గుర్తించారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,000 చొప్పున 8,400 మందికి ఆర్థిక సాయం అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**ప్రజాప్రతినిధులకు పరీక్ష**

గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యతను ప్రభుత్వం ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఎమ్మెల్యేలు ఆ బాధ్యతను మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ పట్టణ, గ్రామ శాఖ అధ్యక్షులకు అప్పగించారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధులు పెద్ద పరీక్షనే ఎదుర్కొన్నారు. యూనిట్‌లు తక్కువ అర్హులు వేలల్లో ఉండడంతో వారికి తలనొప్పిగా మారింది. ఏదో విధంగా తొలి విడత పూర్తి కాగా మిగతా దశల్లో ఇబ్బందులు తప్పేలా లేవు.

**అర్హులందరికీ కష్టమే..** జిల్లాలోని 421 గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలో 891 మధిర గ్రామాలు ఉన్నాయి. ఆరు మున్సిపాలిటీల్లోని 104 వార్డులు ఉన్నాయి. మొత్తం 34,451 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు 87 టీంలుగా ఏర్పడి క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేశారు. సర్వే జరుగుతున్న సమయంలోనే అధికార పార్టీ నేతలు తమకు చెందిన వారిని అర్హులుగా నమోదు చేయించారు. సర్వే ప్రకారం 24,291 మంది అర్హులుగా, 10,160 మందిని అనర్హులుగా గుర్తించారు. జాబితాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు.

**అత్యధికంగా వలిగొండ మండలంలో..**

అత్యధికంగా వలిగొండ మండలంలో 1,924 మంది అర్హులున్నారు. ఆ తర్వాత చౌటుప్పల్ 297, మోత్కూర్ 452, యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో 164 మందిని గుర్తించారు.

**నియోజకవర్గానికి మూడు వేల మంది**

జిల్లాలో 8,400 మందికి తొలి విడతలో ఆర్థిక సాయం అందనుంది. నియోజకవర్గానికి మూడు వేల చొప్పున ఆలేరు, భువనగిరికి 6 వేల మందికి కేటాయించారు. మిగతా 2400 యూనిట్‌లను జిల్లా పరిధిలో ఉన్న తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని మండలాలు, మున్సిపాలిటీలకు కేటాయించారు. గుర్తించిన వారిలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని 12 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి 18,277 మంది, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు నియోకవర్గాల్లోని ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో 6014 మంది ఆర్థిక సాయం కోసం ఎంపికయ్యారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన తర్వాత మూడు దశల్లో ఆర్థిక సాయం అందనుంది.

## ప్రభుత్వం దిగి వచ్చే దాకా దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

- 11వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె

భువనగిరిటౌన్ : ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు స్పష్టం చేశారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా ప్రభుత్వం తమకు ఉద్యోగభద్రత కల్పించడం లేదన్నారు. విద్యాశాఖ నిర్వహించే కార్యక్రమాల్లో తమ తాము ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు, మన ఊరు - మన బడి, ప్రగతి నివేదికలు తయారు చేయడం, యూడైస్‌లో విద్యార్థుల వివరాలు నమోదు వంటి పనులను తామే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రమకు మించి పని చేస్తున్నా ప్రభుత్వం తమ గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. దీక్షకు భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ సంఘీభావం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం పాండు, డి.భాస్కర్, నాగార్జున, తిరుపతి, శ్రవణ్, చైతన్య, సునీత, యాదగిరి, శివరంజని, బసవలింగం, మోహనాచారి, తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 16 వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 16 అర్జీలు వచ్చాయి. అదనపు కలెక్టర్‌లు వీరారెడ్డి, భాస్కర్‌రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. వినతుల్లో రెవెన్యూకు సంబంధించి అత్యధికంగా 12 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులు ఇలా..**

- గిరిజన సంక్షేమానికి మంజూరైన రూ.9.80 కోట్లు గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంజీనాయక్ కోరారు.
- పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని రాచకొండ రెవెన్యూ పరిధిలోని రైతులు కోరారు.
- చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని చౌటుప్పల్ పట్టణానికి చెందిన స్వామి ప్రజావాణిలో విన్నవించారు. ఉదయం 11 దాటినా విధులకు రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పన

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సాక్షి,యాదాద్రి : తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు, సవరణ కోసం వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు, సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులను చైతన్య పరుస్తున్నట్లు వివరించారు. దివ్యాంగులు, వయోవృద్ధులను ఓటరు జాబితాలో మార్కింగ్ చేస్తున్నామని, జనాభా, లింగ నిష్పత్తి ప్రకారంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రద్ధ పెడితే సద్వినియోగం!

- యాదగిరిగుట్టలో నిరుపయోగంగా యోగానంద నిలయం
- కరోనా కారణంగా నాలుగేళ్ల క్రితం మూసివేత
- నేటికీ తెరవని అధికారులు
- సరైన వసతి లేక భక్తులకు తిప్పలు



యాదగిరిగుట్ట పట్టణంలో నిరుపయోగంగా ఉన్న యోగానంద నిలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి వచ్చే సామాన్యభక్తులు బస చేయడానికి ఇబ్బందులు తప్పడంలేదు. ఒకప్పుడు యాదగిరిగుట్ట పట్టణంలో నడిబొడ్డున ఉన్న యోగానంద నిలయం ఎంతో సౌకర్యంగా ఉండేది. సామాన్య భక్తులు ఇక్కడ బస చేయడంతో పాటు వంట కూడా చేసికొని తినేవారు. కానీ, కరోనా పేరుతో నాలుగేళ్ల క్రితం యోగానంద నిలయాన్ని మూసివేయడంతో సామాన్య భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**58 గదులు, ఏడు హాళ్లు**

భక్తులు బస చేయడానికి యాదాద్రి కొండ కింద బస్టాండ్ ఎదురుగా 1986 జనవరి 22న యోగానంద నిలయాన్ని ప్రారంభించారు. ఇందులో 58 గదులు, 7 పెద్ద హాళ్లు ఉన్నాయి. ఇందులో అతి తక్కువ ధరకు గదులు అద్దెకు ఇచ్చేవారు. ఈ నిలయం 2019వరకు భక్తులకు సేవలందించింది. 2019లో కరోనా విజృంభించడంతో యోగనంద నిలయాన్ని మూసివేశారు. నాలుగేళ్లు అవుతున్నా తిరిగి తెరవడం లేదు. దీంతో నిర్వహణ లేక భవన సముదాయం శిథిలమవుతోంది.

**పక్కనే ఆండాళ్ సదనం**

యోగానంద నిలయాన్ని మూసివేసినప్పటికీ దానికి ముందు భాగంలో ఉన్న దుకాణాలు కొనసాగుతున్నాయి. దుకాణాలను దేవస్థానం అధికారులు టెండర్లు వేసి లీజుకు ఇస్తున్నారు. ఈ దుకాణాల పక్కనే ఆండాళ్ సదనం నిర్మించి గదులను భక్తులకు ఇస్తున్నారు. కానీ, యోగానంద నిలయాన్ని అందుబాటులోకి తీసుకురావడం లేదు.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..**

శ్రీస్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఒక రోజు ఇక్కడే నిద్ర చేయాలనే సెంటిమెంట్ ఉంటుంది. ఒకప్పుడు కొండపైన గదులు తక్కువగా ఉండటంతో అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న యోగానంద నిలయంలో పలువురు భక్తులు తమ కుటుంబాలతో వచ్చి నిద్రచేసి వెళ్లేవారు. ఇప్పుడది మూతపడటంతో మద్యం ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలు అడ్డాగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా గదుల దర్వాజలు, తలుపులు, కిటికీలతో పాటు విద్యుత్ సామగ్రి, ఫ్యాన్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్తున్నారు. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి యాదగిరిగుట్టకు వచ్చిన వ్యక్తులు యోగానంద నిలయంలో తలదాచుకుంటున్నారు. కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన సందర్భాలు ఉన్నాయి.

**మరమ్మతులు చేయాలి**



ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపై ఉన్న వసతి గృహాలన్నింటినీ కూల్చివేశారు. దీంతో సరైన వసతి గృహాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. యోగానంద నిలయానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తే ఇబ్బందులు తొలగిపోతాయి.

-వెంకటేష్‌గౌడ్, యాదగిరిగుట్ట

**సరైన వసతి లేదు**



భక్తులు శ్రీచక్ర కాంప్లెక్స్ తర్వాత యోగనంద నిలయాన్ని ఎక్కువగా ఇష్టపడేవారు. దీన్ని నాలుగేళ్ల క్రితం మూసివేశారు. నాటి నుంచి భక్తులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఆలయ ఉద్ఘాటనతో భక్తుల తాకిడి పెరిగింది. భవనాన్ని కూల్చి నూతనంగా నిర్మించాలి.

-పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట

## అంగన్‌వాడీల సమ్మెబాట



యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

- 329 కేంద్రాల్లో నిలిచిన సేవలు
- కొన్ని సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరిచిన కార్యదర్శులు, సర్పంచ్‌లు

భువనగిరిటౌన్ : ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం నుంచి సమ్మె బాట పట్టారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నామని, ఇతర శాఖల పనుల్లో సైతం పాల్గొంటూ ప్రభుత్వానికి చేదోడువాదోడుగా ఉంటున్న తమను పట్టించుకోవడం లేదని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట దీక్ష చేపట్టారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు హాజరుకాబోమని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ సర్కిళ్ల పరిధిలో ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 901 ఉండగా.. కార్యకర్తలు, ఆయాల సమ్మె కారణంగా మొదటి రోజు 329 కేంద్రాలు మూతపడ్డాయి.

**బీఎల్‌ఓ విధులనూ బహిష్కరిస్తామని హెచ్చరిక**

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కేంద్రాలను బంద్ చేసి సమ్మెకు వెళ్తున్న క్రమంలో తాళం చేవిలు ఇవ్వాలని శిశు సంక్షేమ అధికారులు వారిని ఆదేశించారు. అయినా బేఖాతరు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి తెరిచారు. ఉన్నతాధికారుల తీరుపై టీచర్లు, ఆయాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదనంగా నిర్వహిస్తున్న బీఎల్‌ఓ విధులను కూడా నేటినుంచి బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు.



తాజ్‌పూర్‌లో తాళం పగులగొట్టి అంగన్‌వాడీ సెంటర్‌ను తెరిచిన కార్యదర్శి

**అమలుకాని పోషణమాసం**

పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్‌ను పోషణ మాసంగా నిర్వహించాలి. ఈ నెల 1నుంచి 30వ తేదీ వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి చిన్నారుల ఎత్తు, బరువు, కొలతలు సేకరించి పోషణ్ ట్రాకర్‌లో వివరాలను నమోదు చేయాలి. కానీ,అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమ్మె యోచన కారణంగా ఒక్క కార్యక్రమం అమలు చేయలేదు.

### విద్యార్థుల ప్రగతికి పాఠశాలలే వేదికలు

మోత్కూరు : విద్యార్థుల ప్రగతికి ప్రభుత్వ పాఠశాలలే వేదికలని సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ అన్నారు. మోత్కూరు మండలంలోని పాటిమట్ల ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ముక్కంల లింగమల్లు అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో అభినయ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో పనిచేసి రిటైర్ అయిన ఉపాధ్యాయులను మళ్లీ పాఠశాలకు పిలిచి సన్మానించడం గొప్ప విషయమన్నారు. తన ఉన్నతికి , తాను పాటల రచయితగా ఎదగడానికి ప్రభుత్వ పాఠశాలలే కారణమన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంలో పాటిమట్ల ఉపాధ్యాయులు ముందుంటారని అభినందనలు తెలిపారు. ఆత్మీయ అతిథి యాదగిరి లక్ష్మి మాట్లాడుతూ గురువులను సన్మానించుకోవడం గొప్ప సంస్కారం అన్నారు. అంతకుముందు పాటిమట్ల పాఠశాలలో పని చేసి దివంగతులైన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొప్పుల రవీందర్‌రెడ్డి, వనం శాంతికుమార్, ఆకవరం వల్లభాయ్, అండెం సుధాకర్‌రెడ్డి, సోలిపురం వెంకట్‌రెడ్డి, జి.రాజిరెడ్డి, అండెం వెంకట్‌రెడ్డి, తొగిటి నరసింహాచారి, కొల్లోజు నరసింహాచారి, మిర్యాల కృష్ణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు బి.వీరాచారి, వి.నరేష్, టి.ఉప్పలయ్య, కె.కృష్ణవేణి, కె.రామానుజమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభినయ శ్రీనివాస్

## 'ఫేస్ రికగ్నైజేషన్'తో పారదర్శకత



భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫేస్ రికగ్నైజేషన్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ

- డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి : విద్యార్థుల హాజరు నమోదు కోసం విద్యాశాఖ నూతనంగా తీసుకువచ్చిన ఫేస్ రికగ్నైజేషన్ విధానం ద్వారా పాఠశాలల్లో అమలు చేసే ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత ఉంటుందని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలోని బాగాయత్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఫేస్ రికగ్నైజేషన్ విధానాన్ని ప్రారంభించి మాట్లాడారు. నూతన విధానం ద్వారా మధ్యాహ్న భోజనం పథకం, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాం అందజేత తదితర కార్యక్రమాల అమలులో అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బస్సు యాత్రను జయప్రదం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్నశ్యాంసుందర్‌రావు

సాక్షి, యాదాద్రి : బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం భువనగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బస్సు యాత్ర విజయవంతానికి రూపొందించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా పీవీ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల జోన్‌కు సంబంధించిన పాదయాత్ర ఈనెల 26న మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభమై అక్టోబర్ 8న తుంగతుర్తికి చేరుకుంటుందన్నారు. 9న ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో, 10న నకిరేకల్‌లో కొనసాగుతుందన్నారు. అనంతరం పార్టీ జిల్లా ఇంచార్జిగా నియమితులైన జె.శ్రీకాంత్, పార్లమెంటరీ ప్రభారీ అట్లూరి రామకృష్ణను నాయకులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, సూదగాని హరిశంకర్‌గౌడ్, నర్లనర్సింగరావు, జగన్‌మోహన్‌రెడ్డి, చందామహేందర్‌గుప్తా, మాయ దశరథ, జనగాం కవితానర్సింహాచారి, రత్నపురం బలరాం, డీఎల్ఎన్ రెడ్డి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బంగారు గొలుసు లాక్కెళ్లిన హిజ్రాలు

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని హిజ్రాలు ఆపి అతడి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. లింగోజిగూడేనికి చెందిన యు. రమేష్ బైక్‌పై స్వగ్రామం నుంచి చౌటుప్పల్ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగోజిగూడెం గ్రామ శివారులోని హైవే–9 హోటల్ ఎదురుగా రోడ్డు పక్కన నిల్చున్న నలుగురు హిజ్రాలు రమేష్‌ను ఆపి అతడితో మాట్లాడుతూ మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 13మందిని కరిచిన కుక్క



కుక్క కరిచిన మహిళకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

నేరేడుచర్ల: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఓ కుక్క సోమవారం చిన్నపిల్లలు, వృద్ధులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే 13 మందిని కరిచింది. కుక్కకాటుకు గురైన లింగయ్య, అనూష, జాని, సైదమ్మ, రజిత, శ్రీనివాస్‌రెడ్డి, ఎలిషా, తిరుపతమ్మ, లింగమ్మ, ప్రశాంతి, సైదమ్మ, లక్ష్మా, రజితను నేరేడుచర్ల పీహెచ్‌సీకి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతున్నారు. బాధితులను బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రాపోలు నవీన్, పట్టణ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తక్కెళ్ల నాగార్జున తదితరులు పరామర్శించారు.

### ఎస్వీ కళాశాలను ప్రభుత్వపరం చేయాలి



ర్యాలీ తీస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర (ఎస్వీ) డిగ్రీ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం ఎత్తివేయాలని, కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాలను బంద్ చేయించి అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో సంవత్సరానికి 1600 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. సూర్యాపేటకు 50 కిలోమీటర్ల దూరం నుంచి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ కళాశాలలో చదువు కోసం వస్తున్నారని తెలియజేశారు. తక్షణమే ప్రభుత్వం, మంత్రి చొరవ తీసుకొని కళాశాలను ప్రభుత్వ కళాశాలగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, సాయి, అబ్దుల్, శివ, విష్ణు, నరేష్, శృతి, సుధా, వైష్ణవి, రేణుక పాల్గొన్నారు.

# ఈ అభాగ్యుడిని ఆదుకోరూ..

- రెండు కిడ్నీలు పాడై మంచానికే పరిమితమైన యువకుడు
- వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయిస్తున్న తల్లిదండ్రులు
- దాతలు సాయం చేయాలని వేడుకోలు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబం

కన్నీటి గాధ

రామన్నపేట: రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద చేనేత కుటుంబానికి అనుకోని ఆపద వచ్చి పడింది. చేతికి ఎదిగిన కుమారుడు చేదోడువాదోడుగా ఉంటాడని ఆ తల్లిదండ్రులు అనుకుంటున్న సమయంలో అతడి రెండు కిడ్నీలు పాడై మంచాన పడ్డాడు. దీంతో తమ కొడుకు పరిస్థితిని చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ కుమారుడిని కాపాడాలని దాతల ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివరాలు.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన తాటి విజయలక్ష్మి, వీరస్వామి దంపతులది నిరుపేద చేనేత కుటుంబం. వీరస్వామి రోజువారీ చేనేత కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు నరేందర్ ఉన్నారు.



నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేందర్



తాటి నరేందర్

కుమార్తెల వివాహం అయ్యింది. ఎంబీఏ పూర్తిచేసిన నరేందర్ మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. దీంతో ఆ కుటుంబం తమ కష్టాలు తీరుతాయని సంతోష పడింది. కానీ విధి వక్రీకరించి నరేందర్ ఉద్యోగంలో చేరిన కొన్నాళ్లకే ఒకరోజు అకస్మాత్తుగా కింద పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించగా రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు తెలిపారు.

**మూడేళ్లుగా వైద్యం..**

గత మూడేళ్లుగా నరేందర్‌కు మెరుగైన వైద్యం చేయించేందుకు అతడి తల్లిదండ్రులు దొరికిన చోటల్లా అప్పులు చేశారు. అయినా నరేందర్ ఆరోగ్యం మెరుగుపడకపోగా ఇటీవల మరింత క్షీణించింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయిస్తున్నారు.

**సాయం చేయదలచిన వారు సంప్రదించాల్సిన నంబర్లు**

బ్యాంక్ అకౌంట్ నంబర్ : 62324593693
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్0021425
ఎస్‌బీఐ, వెల్లంకి బ్రాంచ్
ఫోన్ పే, గూగుల్ పే నంబర్: 9182171882

**కిడ్నీ ఇచ్చేందుకు తల్లిదండ్రులు సిద్ధపడినా..**

నరేందర్ తల్లిదండ్రుల ఆరోగ్యం కూడా వయోభారం చేత అంతంత మాత్రంగానే ఉంటుంది. అయినప్పటికీ కొడుకుకు కిడ్నీ దానం చేసేందుకు సిద్ధపడి వైద్య పరీక్షలు చేయించారు. కానీ వారి కిడ్నీలు అతడికి సరిపోవడం లేదని వైద్యులు తెలిపారు. దీంతో జీవన్‌ధాన్ కింద రిజిస్టర్ చేసుకున్నప్పటికీ ఇప్పట్లో అతని వంతు వచ్చే అవకాశం కనిపించడం లేదు. వారానికి రెండుసార్లు డయాలసిస్ కోసం ఇంటి నుంచి నిమ్స్ ఆస్పత్రికి పోయి రావడానికి ఖర్చులకు కూడా డబ్బులు లేక ఆ కుటుంబం నానా ఇబ్బందులు పడుతోంది. దయార్ద్ర హృదయులు ఆర్థికసాయం చేసి తమ కుమారుడి జీవితాన్ని కాపాడాలని అతడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# ఏ తల్లి ‘పాప’మో..!

- అప్పుడే పుట్టిన పసికందును ముళ్లపొదల్లో వదిలేసిన వైనం
- ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లో ఘటన



చెట్ల పొదల్లో దొరికిన శిశువు



108 సిబ్బందికి శిశువును అప్పగిస్తున్న ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూర్ (ఎస్) : ఏ తల్లి ‘పాప’మో తెలియదు. అప్పుడే పుట్టిన పసికందు.. భారమనుకొని పేగుబంధాన్ని మరిచింది. కనీసం బొడ్డు పేగును తెంపకుండానే.. కన్నప్రేమను చంపుకుంది. పసికందును ముళ్లపొదల్లో వేసిన ఘటన సోమవారం ఉదయం ఆత్మకూర్ (ఎస్) మండలంలోని నెమ్మికల్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న చర్చి పక్కనే ముళ్లపొదలు ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున అటువైపు వెళ్తున్న వారికి శిశువు ఏడుపు వినిపించింది. వెంటనే కొందరు వెళ్లి శిశువును కంపచెట్ల నుంచి బయటకు తీశారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఉన్నతాధికారులకు విషయం తెలిపి శిశువును సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పసికందు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ఎవరి పాపై ఉంటుందో..?**

నెమ్మికల్‌లోని కంప చెట్లలో శిశువు కనిపించడంతో ఎవరి పాపై ఉంటుందోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దండుమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో దాదాపు 4, 5 రోజులుగా సందడి నెలకొంది. ఆదివారం పండుగ చివరి రోజు కావడంతో బంధుమిత్రుల రాకతో నెమ్మికల్‌లో రాత్రి వరకు కోలాహలంగా ఉంది. మరి అప్పుడే పుట్టిన ఈ శిశువును చెట్ల పొదల్లో ఎవరు వేసుంటారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని వ్యక్తులు వేశారా..? లేదంటే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి గ్రామంలో వదిలి వెళ్లారా అన్నది తెలియడం లేదు. అయితే ఇతర గ్రామస్తులు వదిలి వెళ్లేందుకు పెద్దగా అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాపను వదిలేసిన ప్రాంతం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉంటుంది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రధాన రహదారితో ఎలాంటి సంబంధం లేదు. పైగా గ్రామంలో లోపలికి ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**సీసీ కెమెరాలు లేకపోవడంతో..**

గ్రామంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పాపను వదిలేసిన వ్యక్తులు ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారన్నది గుర్తించడం సాధ్యపడలేదు. మొదటగా గ్రామంలో డెలివరికీ ఉన్న మహిళలు ఎవరు..? అని ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల ద్వారా కూపీ లాగితే అసలు విషయం బయటపడే అవకాశముంది.

## తీర్పు పాటించకుంటే చర్యలు తప్పవు

- సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు



విచారణ నిర్వహిస్తున్న ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు

చౌటుప్పల్: ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పును పాటించకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ జగన్నాథరావు అన్నారు. ట్రిబ్యునల్‌ని ఆశ్రయించిన పోచంపల్లి మండలం మెహర్‌నగర్‌కు చెందిన ఆకుల శాంతమ్మ, వలిగొండ మండలం కేర్చిపల్లికి చెందిన ఉంగరాల యాదగిరి, రామన్నపేట మండలం ఎన్నారానికి చెందిన బొక్క కౌసల్య ఫిర్యాదులపై సోమవారం ట్రిబ్యునల్‌లో విచారించారు. మూడు కేసులను ఈనెల 30కి వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులను అనుభవించడమే కాకుండా తల్లిదండ్రులను చివరి వరకు మంచిగా చూసుకోవాలన్నారు. ట్రిబ్యునల్ వరకు రాకుండా పోషణ, సంరక్షణ విషయంలో ఏ లోటు రానియొద్దన్నారు. ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాక వెలువడే తీర్పును అమలు చేయాల్సిందేనన్నారు. ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. తమ బిడ్డలను చూసుకుంటున్న మాదిరిగానే తల్లిదండ్రులను కూడా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ సభ్యుడు, న్యాయవాది ముత్యాల సత్తిరెడ్డి, సెక్షన్ అధికారి సురేంద్రశర్మ తదితరులు ఉన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో కారు, బైక్

అనంతగిరి: బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. అనంతగిరి మండలంలోని బొజ్జగూడెంతండా శివారులో సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన బాడీషా సాయిరాం, అదే గ్రామానికి చెందిన దరిపల్లి ప్రసాద్, అతడి రెండేళ్ల కుమారుడు దరిపల్లి సామ్రాట్ సోమవారం గోకినపల్లి గ్రామం నుంచి నల్లబండగూడేనికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో బొజ్జగూడెంతండా శివారులో కోదాడ నుంచి ఖమ్మం వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిరాం, ప్రసాద్, సామ్రాట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. బాడీషా సాయిరాం తండ్రి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి

- బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం
- భువనగిరి పట్టణ శివారులో ఘటన



కుమార్తె, కుమారుడితో హరి (ఫైల్)

భువనగిరి: బైక్‌పై వెళ్తున్న ఓ కుటుంబం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. సోమవారం తెల్లవారుజామున భువనగిరి పట్టణంలో జరిగిన ఈ ప్రమాదంలో కుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా తండ్రి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన మోర హరి(38)కు భార్య అశ్విని, కుమార్తె ప్రణతి, కుమారుడు మోహిత్ ఉన్నారు. హరి క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. హరి ఆదివారం భార్యాపిల్లలతో కలిసి బైక్‌పై వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలో శుభకార్యానికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై తిరిగి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు బయల్దేరాడు. వీరు భువనగిరి పట్టణ శివారుకు చేరుకోగానే రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో హరి కుమార్తె ప్రణతి(5) అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలపాలైన హరితో పాటు అతడి భార్య, కుమారుడిని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో హరి మృతిచెందాడు. ప్రణతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ సీఐ సుధీర్‌కృష్ణ తెలిపారు.

## ఆర్టీసీ బస్సులో పొగలు

- బస్సు దిగుతుండగా కిందపడి మహిళా ప్రయాణికురాలికి గాయాలు

నకిరేకల్: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఒక్కసారిగా పొగలు వచ్చాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నకిరేకల్ శివారులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయల్దేరింది. మార్గమధ్యలో ఉదయం 6గంటల సమయంలో నకిరేకల్ శివారులోని నగేష్ హోటల్ సమీపంలోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ హైవేపై బస్సులో వెనుక నుంచి ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులు కిందకు పరుగులు తీశారు. ఈ క్రమంలో నకిరేకల్‌కు చెందిన జి. మమత బస్సు మెట్లు దిగుతుండగా కిందపడడంతో ఆమె తలకు దెబ్బలు తగిలాయి. ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో నుంచి దిగిన ప్రయాణికులను ఇతర ఆర్టీసీ బస్సుల్లో వారి గమ్యస్థానాలకు పంపించారు. బస్సు వైరింగ్‌లో షార్ట్ సర్క్యూట్ వలన పొగలు వ్యాపించి ఉండవచ్చని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సూర్యాపేట రూరల్: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన సూర్యాపేట మండలంలోని రూప్లాతండాలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాసాయిగూడెం గ్రామ శివారులో చెట్ల కొమ్మలు ఎల్‌టీ లైన్‌కు తగులుతున్నాయి. దీంతో కరెంట్ ట్రిప్పు అవుతూ విద్యుత్ లైన్లు తెగుతున్నాయి. వాటిని సరిచేసేందుకు అసిస్టెంట్ లైన్‌మెన్ సత్యనారాయణ, రూప్లా తండాకు చెందిన ధరావత్ నాగరాజు (24) చెట్ల కొమ్మలు నరుక్కుంటూ ఎల్‌టీ లైన్ క్లియర్ చేస్తున్నారు. ఈ క్రమంలో లైన్‌కు దగ్గరలో ఉన్న 11 కేవీ వైరుకు ప్రమాదవశాత్తు నాగరాజు కుడి చేయి తగిలింది. దీంతో నాగరాజు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎంజీయూలో కాంట్రాక్టు అధ్యాపకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



ఎంజీ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు



ఆర్ట్స్ బ్లాక్ పరిపాలనా విభాగం వద్ద నినాదాలు చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

ఎంజీయూ (నల్లగొండ రూరల్): తమ సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంజీయూలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రమ దోపిడీ, అధిక పనిభారం, మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలని కోరారు. దశాబ్దకాలంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా.. సమాన వేతనం లేదన్నారు. అదేవిధంగా కాంట్రాక్టు అధ్యాపకులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో 140 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ చేసిన విధంగానే యూనివర్సిటీలోనూ కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు శేఖర్‌రెడ్డి, నాగయ్య, ప్రగతి, రామచంద్రుడు, రవీందర్‌రెడ్డి, మౌనిక, శంకరాచారి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయురాలికి ఉత్తమ ట్రైనర్ అవార్డు



జయప్రకాష్ నారాయణ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కవిత

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయురాలు నారాయణ కవిత సోమవారం హైదరాబాద్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ వారి ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ అండ్ ట్రైనర్ అవార్డును రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

## యాదాద్రిలో ఎంపీ మిథున్‌రెడ్డి పూజలు



ఎంపీ మిథున్‌రెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి వెంకటేష్

యాదగిరిగుట్ట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీ మిథున్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు పూజలు చేశారు. మిథున్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ప్రొటోకాల్ అధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

## జీఓ నంబర్ 2 రద్దు చేయాలి

మిర్యాలగూడ టౌన్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులలో రిజర్వేషన్లు అడ్డుకునే జీఓ నంబర్ 2ను ప్రభుత్వం రద్దు చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మిర్యాలగూడ పట్టణలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త రోస్టర్ ప్రకారం ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. పదోన్నతి కల్పించే ప్రతి పోస్టులోనూ రిజర్వేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించాలని కోరారు. తర్వలో చేపట్టనున్న ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రమోషన్లలోనూ అడ్‌హక్ విధానాన్ని తొలగించాలని కోరారు. సమావేశంలో గోపినాయక్, మక్లానాయక్, శంకర్‌నాయక్, జమ్లానాయక్, సైదానాయక్, మోతీలాల్, లాలునాయక్ తదితరులున్నారు.

## ఎమ్మార్పీఎస్‌ది ప్రజాస్వామిక ఉద్యమం

భానుపురి (సూర్యాపేట): ఎస్సీ వర్గీకరణ కావాలని ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమం ప్రజాస్వామికమైందని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్యయాదవ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని 30 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. హక్కుల కోసం ఉద్యమించాలన్న అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్ ఉద్యమం కొనసాగుతుందని, ఈ ఉద్యమానికి ప్రజాస్వామ్య వాదులంతా మద్దతు తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోవడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తెలంగాణ జనసమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, బహుజన కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి చామకూరి నరసయ్య, దళిత బహుజన మహాసభ ఉమ్మడి నల్ల గొండ జిల్లా అధ్యక్షుడు నారబోయిన వెంకట్‌యాదవ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్నమాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టల మల్లేష్, నాయకులు ఎర్ర వీరస్వామి, పట్టణ ఇన్‌చార్జి దైద వెంకన్న, దాసరి వెంకన్న, తాటిపాముల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

## నాలుగు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు సోమవారం 3,941 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను ఒక అడుగు పైకెత్తి 2,979సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టు భూములకు 434 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 3,312 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటిమట్టం 643.85 అడుగుల మేర నీరు ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి నేటి వరకు ప్రాజెక్టు ద్వారా 20.23 టీఎంసీల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## ఉదయనిధి స్టాలిన్‌ను ఉరితీయాలి



ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టౌన్: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను ఉరితీయాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, రమేష్‌రెడ్డి, దాసోజు యాదగిరిచారి, పాలకూరి రవిగౌడ్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కొండ భవానిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

Education
Complete any Degree; P.G; Diploma; B.Tech; BAMS; BHMS; D.ఫార్మసీ; B.ఫార్మసీ; ANM; GNM; నర్సింగ్ in 6 months. ✆ 95504 43817 [B-190758]

ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1119]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 8186055849 [G-751669]

Services
శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788626]

Real Estate
VILLA FOR SALE
Ready to Occupy Duplex Luxury Villas in The Best Gated Community at Miryalaguda. Next to New Dmart. Club House, Swimming Pool Fully Operational Must See Call: 9502277099 [H-788588]

BUSINESS OFFER
మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573833520, 9059833520. [M-1221546]

Wanted
త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, ఫోన్ : 9963114535, 7287061111 [HA-189330]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.